కథ

# ఈ జీవన పయనంలో...

- కొఠారి వాణీచలపతిరావు

పెట్రోల్ బంక్‌లో కార్లు, స్కూటర్లు లైన్ కట్టి వున్నాయి. విశాలమైన ఆ పట్టణానికి గుండెకాయ లాంటి ఒక ఏరియాలో ఉంది ఆ పెట్రోల్ బంక్.

"కితనా పెట్రోల్ చాహియే సాబ్." వీణ మీటినట్లు వినిపించిన ఆ తియ్యటి కంఠానికి విస్మయంగా తల పక్కకు తిప్పి చూశాడు ఎర్రటి మారుతీ కారులో ఠీవిగా కూచున్న ఓ మధ్య వయస్కుడు.

నేవీ బ్లూ కలర్ ప్యాంటు, షర్టు వేసుకుని, భుజం మీదుగా వేళాడుతున్న క్యాష్ బ్యాగ్‌తో 'పోనీటైల్'లో అందంగా వున్న ఆ అమ్మాయి వంక తన్ను తాను మరిచి అలాగే చూస్తూండిపోయాడు ఆ వ్యక్తి.

రజియాకు అది అలవాటైన అనుభవమే గనుక "బోలియే సాబ్ కితనా?" అంది అతి సామాన్యంగా.

"టెన్ లీటర్స్" అన్నాడు ఆ వ్యక్తి వాస్తవానికి వస్తూ.

"చాబీ దీజీయే" అంటూ కారు 'కీ' తీసుకుని 'మీటర్ దేఖియే సాబ్' అంటూ పెట్రోల్ పైప్ పట్టుకుని పెట్రోల్ పోసింది రజియా. అతనే కాదు అక్కడ వున్న ప్రతి మగవాడి కళ్లు రజియా మీదే ఉన్నాయి.

ఆమె అందంతో పాటు ఒక ఆడపిల్ల పెట్రోల్ బంక్‌లో పనిచేయటం అన్న ఆ దృశ్యాన్ని ఆశ్చర్యంగా చూస్తున్నారు అందరూ. ఆ వింత ఆ రోజే కాదు ప్రతి రోజూ అక్కడికి వచ్చేవాళ్ళకు ఆశ్చర్యం కలిగిస్తుంది. అయినా రజియా మాత్రం ఇదేమీ పట్టించుకోదు.

ఆమె చేతులు చకచకా తన డ్యూటీని చేసుకుంటూ పోతాయి.ఆమె మనసు తన అవసరాలను, బాధ్యతలను తప్ప మరో విషయాన్ని గురించి ఆలోచించదు.

డిగ్రీ చేతబట్టుకుని ఉద్యోగం కోసం ప్రతి ఆఫీసు మెట్లూ ఎక్కి దిగింది. అడ్డమైన వాళ్ళముందూ చేయి చాపింది. చాపిన చేయిని పట్టుకుని బలాత్కారం చేయబోయిన వాళ్ళు కొందరైతే, నీ చేతులు ఏమాత్రం తడి చేయగలవని తమ చేయి చాచినవాళ్ళు మరి కొందరు.

ముగ్గురు ఆడపిల్లలకు జన్మనిచ్చిన పాపానికి పెళ్ళిళ్ళు చేయలేక రోజూ నిశ్శబ్దంగా ఏడుస్తున్నారు తల్లిదండ్రులు.

రజియా ఆ యింట్లో మూడో ఆడపిల్లగా పుట్టింది. తండ్రి సంపాదన తినటానికి, యింటి అద్దెకు అంతంత మాత్రంగా సరిపోతుంది.

అందుకే కట్నాలు ఇవ్వలేకపోయినా కనీసం తమ పెళ్లిళ్ళు జరిపించే కార్యక్రమంలో తండ్రికి సాయ పడాలనుకున్నారు ఆ ఆడపిల్లలు. పెద్ద పిల్ల మిషన్ కుట్టి, రెండో పిల్ల బడి పిల్లలకు చదువు చెప్పి సంపాదిస్తున్నారు.

కష్టపడి డిగ్రీ సంపాదించిన రజియా ఉద్యోగం మీద ఎన్నో ఆశలు పెట్టుకుని అవి నిరాశలు కాగా విసిగి వేసారిపోయింది. ఓసారి బస్టాండులో నిల్చొని వుంటే ఎదురుగా వున్న ఆ పెట్రోల్ బంక్‌లో ఓ పదిహేనేళ్ళ కుర్రాడు పెట్రోల్ పోస్తున్న దృశ్యం చూసి 'ఈ పని నేనెందుకు చేయకూడదు?' అనిపించింది. ఏ పెట్రోల్ బంక్‌లోనూ మగపిల్లలే తప్ప ఆడ పిల్లలు కన్పించరు. కనుక ఈ పనిలో థ్రిల్ వుంది. 'అబ్బా'కు కాస్త ఆసరాగా వుండే అవకాశం వుంది' అనుకుంది రజియా. ఆ ఆలోచన రాగానే వెంటనే వెళ్ళి పెట్రోల్ బంక్ యజమానిని కలిసింది. ముందు నోరెళ్ళబెట్టి చూసినా ఆ తరువాత వెంటనే ఒప్పుకున్నాడు. ఒక ఆడపిల్ల తన బంక్‌లో పనిచేస్తే గిరాకీ బాగా పెరుగుతుంది అన్న ఆశతో. అలాగే పెరిగింది. లాభాలు దండిగా వస్తున్నాయి. అందుకే ఇప్పుడు రజియా జీతం కూడా పెరిగి వెయ్యి రూపాయలయింది.

ఘోషా వదిలిపెట్టి చదువుకోవడానికి కాలేజీకి వెళ్తానన్న కూతుర్ని ముందు మందలించినా ఆ తరువాత ఆమె తెలివితేటలకు, ధైర్య సాహసాలకు మెచ్చుకో కుండా వుండలేకపోయారు రజియా తల్లిదండ్రులు. మగపిల్లవాడిలా ప్యాంటు షర్టు వేసుకుని తమ కూతురు ఒక పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్నందుకు ఇప్పుడు వారు సిగ్గుపడటం లేదు; గర్విస్తున్నారు.

* * *

సికింద్రాబాద్ స్టేషన్ బిజీగావుంది ఎప్పటిలాగే. లైట్ల వెలుగులో పెళ్ళి పందిరిలా సందడిగా వున్న ప్లాట్ ఫారం మీదికి ఏ.పి. ఎక్స్‌ప్రెస్ వచ్చి ఆగింది. అందులోంచి దిగిన ఇద్దరు వ్యక్తులు బ్రీఫ్‌కేసు చేతిలో పట్టుకుని, ఎయిర్ బ్యాగ్ భుజానికి తగిలించుకుని నడిచి వచ్చి ఆటో స్టాండులో నిల్చున్నారు.

"ఆటో కావాలా సార్" తమ పక్కనే వినిపించిన ఓ ఆడగొంతు విని ఆశ్చర్యంగా చూసారు ఆ ఇద్దరూ ఒకేసారి అటువైపు.

ప్యాంటు, షర్టు మీద 'కాకీ రంగు' షర్టు ఓవర్ కోట్‌లా వేసుకుని నిల్చుని వుంది ఒక స్త్రీ.

"నువ్వు ఆటో డ్రైవర్‌వా" ఇంకా నమ్మకం కుదరక ప్రశ్నించాడు ఆ యిద్దరిలో ఒకతను.

"అవును సార్" అంది ఆమె అతి మామూలుగా.

ఆడ డ్రైవర్ నడుపుతున్న ఆటోలో కూర్చుని వెళ్ళ టం ఆ వ్యక్తులకు చాలా థ్రిల్లింగ్‌గా అనిపించిందేమో మారు మాట్లాడకుండా ఆమె వెంట పార్కింగ్ ప్లేస్‌కు నడిచి ఆటోలో కూర్చున్నారు. "బంజారా హిల్స్ పోనీయ్" అన్నారు.

నిర్మానుష్యంగా వున్న విశాలమైన రోడ్డు మీద ఆటో నడుపుతున్నది ఆమె.

ఉన్నట్టుండి వెనక నుండి ఒక వ్యక్తి "నీ పేరేమిటి?" అని ప్రశ్నించాడు.

"అలివేలు" ముక్తసరిగా జవాబిచ్చింది ఆమె.

"రాత్రిపూట ఆటో నడపాలంటే ఆడదానివి నీకు భయం వెయ్యదా?" అని అడిగాడు మరో వ్యక్తి.

"భయం ఎందుకు సార్. నా ఆటోలో ఎవరు కూర్చున్నా వాళ్ళు నాలాంటి మనుష్యులే గానీ దయ్యాలు, రాక్షసులు కాదు కదా. మనిషికి మనిషిని చూస్తే భయం ఎందుకు?" నవ్వుతూ అంది అలివేలు.

కొంచెంసేపు అక్కడ నిశ్శబ్దం చోటు చేసుకుంది. ఆ తరువాత వెనక నుండి సన్నగా ఈల వినిపించింది. మరికొంతసేపటికి వెనక నుండి ఒక బలమైన హస్తం అలివేలు భుజం మీద పడింది.

"ఆటో ఆపు!" కఠినంగా పలికింది ఒక కంఠం.

"ఎందుకు?" తల వెనక్కు తిప్పకుండా ప్రశ్నించింది అలివేలు.

"భయం ఎందుకు అన్నవుగా చూపించటానికి."

ఆటో ఠక్కున ఆపింది అలివేలు.

ఆ ఇద్దరూ కిందికి దిగి తమ బలమైన చేతులతో ఆటో కదలకుండా పట్టుకుని "కిందికి దిగు" అన్నారు.

మౌనంగా కిందికి దిగింది అలివేలు.

నిర్జనమైన ఆ రోడ్డు మీద ఆ సమయంలో ఆ ముగ్గురూ తప్ప నాల్గో వ్యక్తి లేడు.

ఒక వ్యక్తి వెకిలిగా నవ్వుతూ అలివేలు రెండు చేతులను వెనక్కు విరిచి పట్టుకున్నాడు.

రెండో వ్యక్తి ఆమెమీదికి వంగి అసభ్యంగా ప్రవర్తించబోయాడు.

అదను చూసి ఆ యిద్దర్నీ, ఒకర్ని కాలితో ఒక తన్ను తన్ని, మరొకర్ని చేయి మెలిపెట్టి కింద పడేసింది అలివేలు.

అలా జరుగుతుందని ముందుగా ఏమాత్రం ఊహించకపోవటాన యిద్దరూ ఒకేసారి కింద పడిపోయారు. ఇంక అలివేలు సుడిగాలిలా విజృంభించింది. ఒక్క క్షణం కూడా వృథా చేయకుండా అరచేతిని చాకులా ఉపయోగించి మెడమీద పట్టులెరిగి కొట్టింది. కాలితో పొట్టమీద, ఛాతీ మీద తంతూ మెరుపులా దాడి చేసింది. రెండు మూడు నిముషాలు ఆమెను ఎదుర్కోటానికి విశ్వ ప్రయత్నం చేసి... సాధ్యం కాక కాలికి బుద్ధి చెప్పారు యిద్దరూ ఒకేసారి.

"రౌడీ వెధవల్లారా. ఒంటరిగా కనిపించిన ఆడదంటే అంత అలుసురా మీకు. పొట్ట కూటి కోసం ఆటో తీసు కుని రోడ్డు మీదికి వచ్చిన ఆడదానికి ఆ మాత్రం ఆత్మ

బలం, శారీరక శక్తి ఉండవని ఎలా అనుకున్నార్రా!" అని తనలో తనే కసిగా అనుకుంది అలివేలు. ఆటోలో వాళ్లు వదిలి వెళ్ళిన బ్రీఫ్‌కేసును, బ్యాగ్‌ను విసురుగా రోడ్డు పక్కకు విసిరేసి వేగంగా ఆటో నడిపించుకుంటూ ఠీవిగా వెళ్ళిపోయింది అలివేలు.

ఇద్దరు పిల్లల పోషణ భారాన్ని తనమీద వదిలేసి భర్త అకస్మాత్తుగా చనిపోతే పెద్దగా చదువుకోని అలివేలు ఆటో డ్రైవర్‌గా మారింది. అప్పుడే ఆత్మరక్షణ కోసం అవసరం అనిపించి 'కరాటే' స్కూల్లో జాయిన్ అయింది.

కార్లు, విమానాలు నడుపుతున్న ఆడవాళ్ళను టి.వి. లో చూసిన అలివేలు "నేను ఆటో ఎందుకు నడపలేను" అన్న ఆత్మ విశ్వాసంతో గడప దాటి బయటికి వచ్చింది.



* * *

ప్రతి మనిషి జీవితం ఓ మహాభారతం అనుకుంటే అందులోని ప్రతి సంఘటన, ప్రతి సమస్య ఒక కురుక్షేత్ర సంగ్రామమే. జీవితానుభవాలు, అనుభూతులు, సమస్యలు, సంఘర్షణలు వీటికి ఆడ, మగ తేడా లేదు. అలాంటప్పుడు జీవనోపాధికి ఎన్నుకునే మార్గాల్లో, సమస్యలకు సమాధానం చెప్పుకునే పద్ధతిలో ఆడా, మగ తేడాలెందుకు? పుట్టిన మరురోజు నుండే ఇంట్లో తల్లిదండ్రులు తనకు, తమ్ముడికి మధ్య చూపిస్తున్న ఆడ మగ బేధ భావాలు చూసి సహించలేని వైదేహి పట్టుదలతో పోలీస్ ఆఫీసర్ అయి ఆడ వాళ్ళు దేనికీ తీసిపోరు అని నిరూపించింది. రిక్షా తొక్కి సంసారాన్ని ఈడ్వాల్సిన మొగుడు తాగుబోతై అస్తమానం మత్తులో అసమర్థుడై పడి ఉంటుంటే ఆత్మస్థైర్యంతో ఆ రిక్షా తను తొక్కి, మొగుడ్ని, పిల్లలను పోషించింది రాజమ్మ. ఇలా ఎన్ని జీవిత కథలో ఈ జీవన పయనంలో!

అలా జీవనరథానికి తామే సారథులైన మగువలందరికీ నమస్సుమాంజలి.